క్లుప్తంగా

కలెక్టర్‌కు వీర్వోల సంఘం అభినందనలు



కలెక్టర్ నాగరాణిని అభినందిస్తున్న రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు

భీమవరం (ప్రకాశంచౌక్): గవర్నర్ చేతుల మీదుగా ఇటీవల రెడ్ క్రాస్ గోల్డ్ మెడల్ అందుకున్న జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణికి కలెక్టర్ చాంబర్‌లో ఏపీ వీర్వోల సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి మిరియాల లక్ష్మీనారాయణ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జకరయ్య శాలువాతో సత్కరించి, చిత్ర పటాన్ని అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వోలు సత్తిబాబు, రామకృష్ణ, గోపీకృష్ణ కుమార్, ప్రజ్యోతన, పార్వతి, విజయ, కిరణ్మయి, సుధారాణి, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న రామచంద్రారెడ్డి

భీమవరం: పట్టణంలోని సీపీఎం కార్యాలయం వద్ద ఏర్పాటుచేసిన మజ్జి చలివేంద్రాన్ని భీమవరం మున్సిపల్ కమిషనర్ పి.రామచంద్రా రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య కుల, మతాలకతీతంగా విశేష సేవలందించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జేఎన్‌వీ గోపాలన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.బలరాం, పట్టణ కార్యదర్శి బి.వాసుదేవ రావు, జుత్తిగ నర్సింహమూర్తి, ఎం.వైకుంఠరావు, కె.రత్నకుమారి, తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరునికి పవళింపు సేవ



పవళింపు సేవలో వేంకటేశ్వర స్వామి

భీమవరం (ప్రకాశంచౌక్): జేపీ రోడ్డులోని శ్రీపద్మావతి వేంకటేశ్వర స్వామికి సంప్రదాయబద్ధంగా పవళింపు సేవ నిర్వహించారు. ఆలయ ఈవో ముదునూరి సత్యనారాయణ రాజు పర్యవేక్షణలో ఆలయ చైర్మన్ మంతెన రామ్ కుమార్‌రాజు, కాకులపాటి వీర రాఘవరావు దంపతులచే స్వామి వారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఆలయఅర్చకులు పండితులు నీరా జన మంత్ర పుష్పాలతో నిత్యోపాసన బలిహరణ, చక్రస్నానం, ద్వాదశ ప్రదక్షిణాలు, ధ్వజ అవరోహణ, శ్రీవారికి పవళింపు సేవ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

అమ్మవారికి వార్షికోత్సవ పూజలు

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక మెంటే వారి తోటలోని శ్రీబాలా త్రిపుర సుందరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అభివృద్ధి కమిటీ పర్యవేక్షణలో మద్దాల సత్యనారాయణ, లక్ష్మీ బ్రహ్మాజీ దంపతులు, మిరెడ్డి వెంకటేశ్వర రావు, శ్రీమతి హేమ దంపతులచే ఆలయ అర్చకులు అమ్మవారికి లలితా పారాయణం, హారతులు, నీరాజన మంత్ర పుష్పాలతో మహాన్యాస పూర్వకంగా అభిషేకాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి కలశాలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. మూడు రోజుల పాటు అమ్మవారికి వార్షిక పూజలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అనధికార వంతెనలు.. ప్రవాహానికి అడ్డంకులు

- పంట కాలువపై అక్రమంగా వంతెనల నిర్మాణం
- వర్షాకాలంలో ముంపునకు గురవుతున్నా పట్టించుకోని అధికారులు



బొనకాల దిబ్బ వద్ద పంట కాలువపై అక్రమంగా నిర్మించిన వంతెన

భీమవరం అర్బన్: ఎల్‌జీ పాడు చానల్ మొగలో అక్రమంగా వంతెనల నిర్మాణం, చెరువుల వద్ద కాలువపై తూములు పెట్టి పూడ్చి వేయడం, గరికట్టులతో ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడి ఎగువన ఉన్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎల్‌జీ పాడు చానల్ భీమవరం పట్టణం మీదుగా మండలంలోని గొల్లవానితిప్ప, గూట్లపాడు, కొత్తపూసలమర్రు, దొంగపిండి గ్రామాల మీదుగా సుమారు 22 కిలోమీటర్లు ప్రవహించి బందాల చేడు డ్రెయిన్‌లో కలుస్తుంది. సుమారు 8 వేల ఎకరాలకు చేపలు, రొయ్యల చెరువులకు, వరి పొలాలకు, రక్షిత మంచినీటి చెరువులకు తాగు, సాగు నీరందుతుంది. యనమదుర్రు డ్రెయిన్ ఉప్పొంగినపుడు ఎల్‌జీ పాడు చానల్ ద్వారా వరద నీరు బంధాలచేడు డ్రెయిన్ ద్వారా ఉప్పుటేరులోకి నీరు ప్రవహిస్తుంది.

చానల్ మొగలో అడ్డంకులు

దొంగపిండి పరిధిలో ఉన్న బోనకాల దిబ్బ నుంచి ఎల్‌జీ పాడు చానల్ బంధాలచేడులో కలిసే వరకు సుమారు కిలోమీటరులో 2 వంతెనలు, 2 అక్రమ గరికట్టులు, 4 తూములతో అడ్డంకులు ఉన్నాయి. దీంతో వర్షాకాలంలో వరద నీరు దిగువకు లాగక గూట్లపాడు నుంచి దొంగపిండి వరకు మెయిన్ రోడ్డు మునిగిపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోట్లాది రూపాయలతో వేసి ఆర్అండ్‌బీ రోడ్డు ధ్వంసమవుతుంది. అంతే కాకుండా ఎంతోమంది రైతులు చెరువులు మునిగిపోయి ఏటా కోట్లాది రూపాయలు నష్టపోతున్నారు.

తూములతో కాలువ పూడ్చేయడంతో ప్రవాహానికి అడ్డు

పంట కాలువ మొగలో కొంతమంది చేపల చెరువుల రైతులు తమ చెరువులకు భారీ చేపలు, తవుడు లారీలు వెళ్లేందుకు పంట కాలువలో భారీ తూములు పెట్టి మట్టి పూడ్చివేయడంతో ఏటా వర్షా కాలంలో ముంపునకు గురవుతున్నాయని ఎగువన ఉన్న రైతులు, గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

పంట కాలువ మొగలో అక్రమ వంతెనలు, గరికట్లు, తూములు పూడ్చి అడ్డంకులు పెట్టినా ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడంతో వారి తీరుపై రైతులు, గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పంట కాలువలను పర్యవేక్షించాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో జోగుతున్నారని పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా ఇరిగేషన్ అధికారులు మొగలో అడ్డంకులు తొలగించాలని గ్రామస్తులు, రైతులు కోరుతున్నారు.

త్వరలో అడ్డంకులు తొలగిస్తాం

బుధవారం ఎల్‌జీ పాడు చానల్ ప్రక్షాళన పనులు ప్రారంభమవుతాయి. అందులో అడ్డంకులను తొలగిస్తాం. ఎల్‌జీ పాడు చానల్‌పై నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న అక్రమంగా ఏర్పాటు చేసిన వంతెనలు, తూములను త్వరలో తొలగిస్తాం. అనుమతులు లేకుండా అడ్డంకులు ఏర్పాటు చేసే వారిపై చర్యలు తీసుకుంటాం.

– ప్రసాదరాజు, ఏఈ, ఇరిగేషన్ శాఖ



పంట కాలువలో అనుమతి లేని గరికట్టు



వర్షాకాలంలో వరద నీటితో మునిగిపోయిన మెయిన్ రోడ్డు (ఫైల్)

దివ్యాంగులను ప్రోత్సహించాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్యాంసుందర్

భీమవరం: బడి వయసు కలిగిన దివ్యాంగ పిల్లలను గుర్తించి పాఠశాలలో పేర్లు నమోదు చేయించి వారిని ప్రోత్సహించాలని సమగ్ర శిక్షా జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ పి.శ్యాంసుందర్ చెప్పారు. మంగళవారం భీమవరం పట్టణంలోని సమగ్ర శిక్షా కార్యాలయ ఆవరణలో దివ్యాంగుల గుర్తింపు, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్యాంప్రసాద్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ద్వారా భవిత కేంద్రంలో దివ్యాంగులకు కల్పిస్తున్న సదుపాయాలను కరపత్రాలతో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జూన్ 9వ తేదీ వరకు ప్రతి గ్రామంలో ఇంటింటి సర్వేను ఉపాధ్యాయులు నిర్వహిస్తారన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం పరీక్షలు, ఉద్యోగాల్లో రాయితీలు కల్పించడమే గాక సమగ్ర శిక్ష ద్వారా అవసరమైన దివ్యాంగుల పిల్లలకు ఉచిత ఉపకరణాలు అందిస్తున్నట్లు చెప్పారు. భవిత కేంద్రాల్లో దివ్యాంగుల పిల్లలకు ప్రత్యేక విద్యతో పాటు స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ సేవలు ఉచితంగా అందిస్తున్నారని వీటిని సద్వినియోగం చేసుకోవాలని శ్యాంసుందర్ చెప్పారు. కార్యక్రమంలో సాహితి విద్య సమన్వయకర్త సీహెచ్ సుబ్రమణ్యం, టి.శ్రీనివాసరావు, వై.పెద్దిరాజు, జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

17న కళా రూప ప్రదర్శన



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ నాయకులు

భీమవరం: అంబేడ్కర్ జీవిత చరిత్రపై కళారూప ప్రదర్శన (నాటిక) ఈ నెల 17వ తేదీన పట్టణంలోని గునుపూడిలో ఏర్పాటు చేస్తున్నట్లు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు చెప్పారు. మంగళవారం కేవీపీఎస్ కార్యాలయంలో అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటిక ప్రదర్శన కరపత్రాలను విడుదలచేసిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ మేధావిగా, నవభారత రాజ్యాంగ నిర్మాతగా చరిత్ర కెక్కిన అంబేడ్కర్ భావజాలం నేటి యువతరానికి ఎంతో అవసరమన్నారు. అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకొని కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక చైతన్య సాంస్కృతిక ఉత్సవాల్లో అంబేడ్కర్ జీవిత చరిత్రను ఆధునిక సాంకేతికతతో కళా రూపాన్ని ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 22వ తేదీన కర్నూలులో ప్రారంభమైన ఈ ప్రదర్శనలు ఈ నెల 18వ తేదీన విజయవాడలో ముగుస్తాయన్నారు. భీమవరంలో ఈ ప్రదర్శనను ప్రజలు విజయవంతం చేయాలని క్రాంతిబాబు పిలుపునిచ్చారు. నాటక ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషనురాజు, ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, కలెక్టర్ చదలవాడ నాగరాణి హాజరవుతారన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల విజయకుమార్, మూటూరి రాజశేఖర్, సైదు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



ఆలయం వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు

కాళ్ల: మండలం జక్కరం గ్రామం ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. గ్రామంలో వేంచేసియున్న శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ పునఃనిర్మాణం, విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ పంచాయతన క్షేత్ర అభివద్ధి కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ముందుగా గ్రామంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని శోభాయాత్ర చేపట్టారు. అదే విధంగా ఆలయం ప్రాంగణంలో ప్రధాన అర్చకులతో ప్రత్యేక పూజలు, హోమాలు వేదమంత్రాల నడుమ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. గోపూజ, గణపతి పూజ, దీక్షాధారణ, కంకణధారణ,వేద స్వస్తి, మత్స్యంగ్రహణం, ఆలయశాలా ప్రదక్షిణ, తదితర ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన హోమశాలలో ఆలయంలో ప్రతిష్ఠించే ఉత్సవ విగ్రహాలను భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రత్యేక పూజల్లో పలువురు దంపతులు పాల్గొని నిత్య పూజలు చేశారు. అదే విధంగా బుధవారం ఉదయం 9.20 గంటలకు త్రయాహ్నిక దీక్షతో శైవాగమశాస్త్ర ప్రకారం పునఃనిర్మాణ ఆలయంలో శ్రీరాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వర స్వామి, శ్రీ విఘ్నేశ్వర స్వామి, శ్రీసూర్యనారాయణ మూర్తి, శ్రీవిష్ణుమూర్తి సహిత శివపంచాయతన క్షేత్రంలో ధ్వజ స్తంభం, పరివార దేవతా విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వారు తెలిపారు. గ్రామ పెద్దలు రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాతపాటి వాసు, నంద్యాల రామరాజు, పాతపాటి యుగంధర్ వర్మ, ఆలయ చైర్మన్ సతీష్, పాతపాటి మురళి రామరాజు, వేగేశ్న సూర్యనారాయణ రాజు, తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవ విగ్రహాలు

సమ్మెను విజయవంతం చేయండి



సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

ఉండి: కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త కార్మికుల సమ్మెకు అందరూ సహకరించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు ధనికొండ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని మహదేవపట్నం పరిధిలోని బేవరేజస్ గోడౌన్ వద్ద హమాలీ కార్మికులతో కలిసి సమ్మె పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానిగా నరేంద్రమోడీ మూడో సారి అధికారంలోకి వచ్చిన వెంటనే నాలుగు లేబర్ కోడ్లను కార్మికులకు వ్యతిరేకంగా కల్పించిన చట్టలపై పోరాడాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బేవరుజెస్ హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామంలో మంగళవారం జరిగిన అగ్ని ప్రమాదంలో పదెకరాల గడ్డివాము దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే విస్సాకోడేరు గ్రామానికి చెందిన రైతు బండారు సత్యనారాయణ పశుగ్రాసం నిమిత్తం పదెకరాల ఎండు గడ్డిని నిల్వ చేసుకోగా ప్రమాదవశాత్తు ఆ గడ్డివాముకు నిప్పు అంటుకోవడంతో ఒక్కసారిగా మంటలు ఎగబడ్డాయి. స్థానికులు భీమవరం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో వెంటనే స్పందించిన అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఏడీఎఫ్ఓ సూర్య ప్రకాశం నేతృత్వంలో సుమారు గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకురావడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ అగ్ని ప్రమాదం వలన సుమారు 50 వేల రూపాయల ఆస్తి నష్టం సంభవించినట్లు ఏడీఎఫ్ఓ సూర్య ప్రకాశం తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

భీమవరం అర్బన్: గ్రామాలోల్ల నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సైకాలజిస్ట్ ఎస్‌కే రహీం అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో డాడీ ఫస్ట్ ఎయిడ్ క్లినిక్‌లో అభిరామ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యం శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఈసీజీ, బీపీ, హోమియోగ్రామ్, ఆర్‌బీఎ, బీఎండీ లాంటి రూ.3500 విలువ గల పరీక్షలను ఉచితంగా చేశారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ బాల మురళీ కృష్ణ రోగులను పరీక్షలు చేశారు. సుమారు 120 మంది రోగులకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ముగిసిన పల్లాలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో పల్లాలమ్మ

ఆకివీడు: మండలంలోని పెదకాపవరం గ్రామంలోని పల్లాలమ్మ అమ్మవారి జాతర ముగింపు సందర్భంగా మంగళవారం అఖండ అన్నసమారాధన జరిగింది. గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కటారి రామకృష్ణ(రాము) ఆధ్వర్యంలో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. గ్రామంలోని వేలాది మంది అన్నసమారాధనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కటారి జయలక్ష్మి, కేశవరావు, పాతపాటి శ్రీనివాసరాజు, కటారి శ్రీకాంత్, కట్రెడ్డి మణికంఠ స్వామి, విద్యాసాగర్, పుచ్చకాయల బ్రహ్మాజీ, కట్రెడ్డి వెంకన్న, ఆంజనేయులు, గిరి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి వైభవంగా చక్రస్నానం



మహా పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఎస్సై దంపతులు

కాళ్ల: కాళ్లకూరులో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి తిరు కల్యాణ మహోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పద్మావతీ సరోవరంలో చక్రస్నానం (చక్రవారి) వైభవంగా నిర్వహించారు. అనంతరం ఆలయంలో స్వామి వారికి పంచామృత అభిషేకాలు అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాళ్ల ఎస్సై ఎస్.శ్రీనివాసరావు దంపతులు స్వామి, అమ్మవార్లకు వసంతోత్సవం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు అశ్వవాహనంపై గ్రామోత్సవంతో పాటు చోరోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి పెద్ద ఎత్తున భక్తులు విచ్చేశారు. ఏర్పాట్లను దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.

బాలల హక్కులపై అవగాహన

వీరవాసరం: గ్రామంలో సర్పంచ్ చికిలే మంగతాయారు ఆధ్వర్యంలో కిశోరివికాసం వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం బాలల హక్కులు, వారి సంరక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీడీ బి.సుజాతా రాణి మాట్లాడుతూ బాలల హక్కుల గురించి వారి రక్షణ గురించి పోక్సో చట్టం గురించి వివరించారు. టి.లక్ష్మీకాంతం చైల్డ్ హెల్ప్ లైన్ 1098 గురించి వివరించారు. ఈ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. నాగ పార్వతి, మాధవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి

పాలకోడేరు: మండలంలోని గొల్లలకోడేరు గ్రామంలో ఉన్న ప్రైవేట్ పాఠశాల మాజీ ప్రిన్సిపాల్ కృష్ణారావుపై ఇప్పటికే పలువురు ఫిర్యాదులు చేయగా, మంగళవారం మరొకరు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. భీమవరానికి చెందిన జవ్వాది రమేష్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. తన ఇద్దరు కుమారులను పాఠశాలలో చేర్చిన సందర్భంగా చెల్లించిన లక్షల రూపాయల ఫీజును ప్రిన్సిపాల్ పాఠశాలకు చెల్లించకుండా సొంతంగా వాడుకున్నాడని తెలిసిందన్నారు. స్కూల్‌కి వెళ్లి ఆరా తీయగా, ఇప్పుడాయన స్కూల్‌లో పని చేయడం లేదని తెలిసిందని చెప్పారు. ప్రిన్సిపాల్‌ని నిలదీయగా, దురుసు గా ప్రవర్తించాడని, విచారణ జరిపి తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్టు తెలిపారు.

కలెక్టర్‌కు అభినందన

భీమవరం (ప్రకాశంచౌక్): రెడ్ క్రాస్ సంస్థకు అత్యుత్తమ సేవలు అందించి ఇటీవల గోల్డ్ మెడల్ పొందినందుకు గాను కలెక్టర్ నాగరాణిని కేంద్ర సహాయ మంత్రి బి.శ్రీనివాసవర్మ మంగళవారం అభినందించారు.

డ్రెయిన్‌లో సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాల డంపింగ్



నాగిడిపాలెం బ్రిడ్జిపై డ్రెయిన్‌లోకి వదులుతున్న సెప్టిక్ ట్యాంక్ వ్యర్థాలు

భీమవరం అర్బన్: మండలంలోని నాగిడి పాలెం బ్రిడ్జిపై యనమదుర్రు డ్రెయిన్‌లోకి సెప్టిక్ ట్యాంకర్ ద్వారా మల మూత్ర విసర్జితాలను డంపింగ్ చేస్తున్నారు. దూర ప్రాంతానికి తీసుకెళ్లి డంప్ చేయాల్సి ఉండగా జనావాసాల మధ్య డంప్ చేయడంతో గ్రామస్తులు, మత్స్యకారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మత్స్యకారులు ఆ డ్రెయిన్‌లోనే చేపల వేట సాగిస్తారు. చుట్టూ జాతీయ రహదారి గుండా అటువైపు వెళ్లే ప్రయాణికులు, వాహనదారులకు, చుట్టు ప్రక్కల గ్రామస్తులకు దుర్వాసన రావడంతో డంప్ చేసేవారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.